నేడు అండర్ - 14 క్రికెట్ సెలక్షన్స్

మల్కాజిగిరి: అండర్–14 విభాగంలో క్రికెట్ సెలక్షన్స్ ఆదివారం నిర్వహిస్తున్నామని, తెలంగాణ స్కూల్ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్ ప్రకటించారు. నేరేడ్‌మెట్‌లోని బ్రహ్మ క్రికెట్ అకాడమీలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంపిక కార్యక్రమం ఉంటుందని, ఆసక్తిగల విద్యార్థులు వయసు ధ్రువీకరణతో హాజరు కావాలన్నారు. ఎంపికైనవారు తెలంగాణ జట్టు తరుపున ఈనెల 21 నుంచి 23 వరకు తమిళనాడు స్కూల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగే జాతీయ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 6301170677.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు, తులసీరమణాచార్యులు కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. లోకకళ్యాణార్థం ప్రతినెలా రెండో ఆదివారం కల్యాణం నిర్వహిస్తామని ఈవో రవీందర్‌రెడ్డి ప్రకటించారు. క్లర్క్ సుధాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

మల్కాజిగిరి: ధర్మశాస్త్ర భక్త సమాజం ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో అయ్యప్ప జన్మదినోత్సవం సందర్భంగా అన్నప్రసాద వితరణ జరిగింది. ఆదివారం స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాశీనాథ్ గురుస్వామి, భాస్కర్ గురుస్వామి పాల్గొన్నారు.

బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్‌గా రాజబాబు



మల్లాపూర్: బీసీ సంఘాల జేఏసీ నాచారం డివిజన్ కన్వీనర్‌గా తిప్పిరి రాజబాబు నియామితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులను బీసీ జేఏసీ సలహాదారులు నల్లా రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా రాజబాబు మట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీ వేసి బీసీ సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు.

ట్రస్మా మేడ్చల్ జిల్లా కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి

శామీర్‌పేట్: ట్రస్మా మేడ్చల్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా) మేడ్చల్ జిల్లా సమావేశం శామీర్‌పేటలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా కాప్రా మండలానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుత్బుల్లాపూర్‌కు చెందిన ఆంజనేయులు, కోశాధికారిగా మేడ్చల్‌కు చెందిన గిరిబాబును ఎన్నుకున్నారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి రామచందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్, హనుమంత్‌రెడ్డి, రాంనర్సయ్య హాజరై ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారంపై నిరంతరం పాటుపడతామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్కాలర్‌షిప్ టెస్ట్



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పోచారం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ విశ్వవిద్యాలయం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తోందని ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. ఆదివారం యూనివర్సిటీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. డొనేషన్లు వసూలు చేసేందుకే యూనివర్సిటీ టెస్ట్ నిర్వహిస్తోందని దుయ్యబట్టారు. నిబంధనలకు వ్యతిరేకంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపడుతున్నందున ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ప్రతినిధులు ధర్మేంద్ర, సల్మాన్ బేగ్, సత్యప్రసాద్, శేఖర్, వేంకటేశ్వర్లు, ప్రీతం, కల్యాణ్, రాజు తదితరులున్నారు.

నిలిచిన పనులు !



ఆగిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు

- గత ప్రభుత్వ హయాంలోనే నత్తనడకన సాగిన వైనం
- రెండెకరాల స్థలంలో రూ.2 కోట్లతో పనులు ప్రారంభం

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కూరగాయలు, మాంసం దుకాణాల సముదాయం (ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్) మార్కెట్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నత్త నడకన నడిచిన ఈ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిగా ఆగిపోయాయి. సుమారు రెండెకరాల స్థలంలో రూ.2 కోట్లతో ప్రారంభించిన ఈ పనులు పిల్లర్ల స్థాయిలోనే ఆగిపోవడంతో స్థానిక ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

2020లో ప్రతిపాదన

2020 ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చి 4 వరకు జరిగిన మొదటి పట్టణ ప్రగతి కార్యక్రమంలో అప్పటి సీఎం కేసీఆర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు ప్రతిపాదన చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో అన్ని రకాల కూరగాయలు, మటన్, చికెన్, చేపలు ఒకే ప్రదేశంలో లభ్యమయ్యేలా సమీకృత మార్కెట్‌కు శ్రీకారం చుట్టారు. నిధులు కేటాయించి రెండేళ్లల్లో పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించారు. కానీ పనులు అనుకున్న సమయంలో ప్రారంభం కాలేదు. దీంతో ప్రారంభోత్సవ పనులే ఆలస్యమయ్యాయి.

స్థల పరిశీలనలో జాప్యం

బోడుప్పల్ నుంచి మల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిలోని సర్వేనంబరు 63/1లో రెండెకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మించేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. మొదట రూ.కోటితో మార్చి 29 న భవన నిర్మాణానికి అప్పటి మంత్రి చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమైనప్పటికీ స్థలం తక్కువగా ఉండటంతో పాటు ఇతర కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి.

సరైన రీతిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో..

మార్కెట్ కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలం సరైన స్థితిలో లేదు. దీంతో గతంలో గీసిన ప్లాన్ ప్రకారం సదరు స్థలం మార్కెట్‌కు సరిపోలేదు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎగువ ప్రాంతంలో మరికొంత ప్రభుత్వ స్థలం ఉంది. దానిని మార్కెట్‌కు కేటాయించాలని కోరుతూ అప్పటి పాలకవర్గం, కమిషనర్ మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి మార్కెట్ కోసం కేటాయించారు. దీంతో గతంలో గీసిన ప్లాన్ స్థానంలో కొత్త ప్లాన్ అప్రూవల్ కోసం పంపించారు. దీంతో పనుల విషయంలో కొంత జాప్యం జరిగింది. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.

ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి..

నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను ప్రారంభించి మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. కూరగాయల సంతలు రోడ్లపై నిర్వహించడం వల్ల ప్రజలు, వాహనాలకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు చొరవ తీసుకుని, ఆగిపోయిన మార్కెట్ పనులను పూర్తిచేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– జనార్దన్‌రెడ్డి, శ్రీసాయినగర్ కాలనీ అధ్యక్షుడు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

మౌలాలి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పరిష్కరిస్తానని కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఆర్కే హౌసింగ్ సొసైటీలో ఆమె పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేసిన ఆమెను కాలనీవాసులు అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. డివిజన్ అధ్యక్షుడు శివగౌడ్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు పోశెట్టి, సుధాకర్, స్థానిక నేతలు సత్యనారాయణ, రాధాబాయి, సుజాత, అరుణ, రూప, రంగారావు, మహదేవ్ తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను అందరూ కొనసాగించాలని అంబేడ్కర్ జయంతి వేడుకల ఉత్సవ కమిటీ కన్వీనర్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు నాచారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేశారు. అంజి, రమేష్, కాటిపల్లి రవీందర్‌రెడ్డి, మల్కా ప్రకాష్, రవికాంత్, ప్రతాప్‌రెడ్డి, రమేష్, నవీన్‌రెడ్డి, అభిషేక్‌గౌడ్, సాయిగౌడ్, అమర్‌నాథ్, ఉదయ్‌కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్/రామంతాపూర్: నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధి సుందరీకరణ పనులతో పాటు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. సన్నబియ్యం పథకానికి ప్రజల్లో నుంచి అనూహ్య స్పందన వస్తుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని సీఎంకు వివరించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని అమ్ముగూడ శ్మశానవాటికలో రూ.1.5 కోట్ల ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతను బట్టి ఎంపీ నిధులను వినియోగిస్తున్నానన్నారు. కార్పొరేటర్లు సునీతాయాదవ్, శ్రవణ్, నాయకులు ఆర్‌కే.శ్రీను, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, పరమేష్, ఆదిత్య, సత్యనారాయణ, శ్యామ్, సుధాకర్, రమణారెడ్డి, సాయి, పరాస్‌జైన్, దినేష్, ప్రసన్న, ధనలక్ష్మి, సుదర్శిని తదితరులున్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

బోడుప్పల్: సేవా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు ముందుండాలని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ 15వ డివిజన్‌లో సూరజ్ నగర్ కమాన్ వద్ద సీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు దాహార్తిని తీర్చడంలో ట్రస్ట్ నిర్వాహకులు ముందుండారన్నారు. డివిజన్‌లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ తన ఉదారతను చాటుకుంటున్నారన్నారు. బొల్లిగూడ చౌరస్తా, అమ్మసాని వెంకట్‌రెడ్డి చౌరస్తా వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేసి వేసవిదాహాన్ని తీరుస్తున్నారన్నారు. సీఆర్ఆర్ వ్యవస్థాపకులు, 15వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సిగురు రేణుకారవికుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

మౌలాలి : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు మల్కాజ్‌గిరి కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్లు, ఉచిత బస్సుప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, మహాలక్ష్మి తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సంతోష్‌రెడ్డి తదితరులు

మల్లాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని నాచారంలో మాజీ సైనికుడు సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్పీకర్, ఎమ్మెల్యేగా పనిచేసి అన్ని వర్గాల ప్రజలకు ఎనలేని సేవలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ నేతలు కృష్ణారెడ్డి, రాజారెడ్డి, మహేష్‌యాదవ్, నరేష్, నూతలకంటి రాజు, రమాకాంత్, లోకేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కిషోర్‌కుమార్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల స్వచ్ఛ భారత్



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్, మహనీయుల విగ్రహాలు, పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు క్రిష్ణగౌడ్, సురేష్, కిషన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాంపల్లి బస్టాప్ వద్ద స్వచ్ఛ భారత్

కీసర: బీజేపీ ఆధ్వర్యంలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో రాంపల్లి బస్టాప్ వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరై బస్టాప్ వద్ద స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద శుభ్రం చేసిన అనంతరం వెస్ట్ గాంధీనగర్‌లోని వికలాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గణపురం శ్యామ్‌సుందర్ శర్మ, మాజీ ఎంపీటీసీ తరిగొప్పుల బలరాం, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌రెడ్డి, జంగారెడ్డి, మహేందర్, వెంకటేశ్వర్‌రావు, నవీన్, వెంకటేశ్వర్ రావు, సురేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి కేటీఆర్ పర్యటన రద్దు

మేడ్చల్: మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు నియోజకవర్గంలో పర్యటించనుండగా ఆ పర్యటనను రద్దు చేసినట్లు ఎమ్మెల్యే మల్లారెడ్డి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. బీఆర్ఎస్ రజతోత్సవసభ అలియాబాద్‌లో ఏర్పాటు చేయగా.. కేటీఆర్ సభకు హాజరు కావాల్సి ఉండగా పర్యటన రద్దు చేసినట్లు ప్రకటించారు.

ఉచిత వైద్య శిబిరం



బోడుప్పల్: పేద, మధ్యతరగతి ప్రజలకు మరిన్ని వైద్యసేవలు అందాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రాల వెంకటేష్‌యాదవ్ అన్నారు. జ్యోతినగర్ కాలనీలో ఆదివారం మెడిస్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తుందని, వాటితో పాటు మరిన్ని సేవలు అందించాలన్నారు. హరి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ విస్తరణకు భూమిపూజ



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని మాతా నిమిషాంబదేవి అమ్మవారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, బీసీ కమిషన్ ప్రత్యేక చైర్మన్ వేంకటేశ్వరరావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అందుబాటులో ఉన్న స్థలంలో ఆలయాన్ని మరింత విస్తరింపజేస్తున్నామన్నారు. రాష్ట్ర నకాష్ సంఘం అధ్యక్షుడు రాచర్ల కేశవ్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

సబ్బండ వర్గాల కోసం కృషి చేసిన అంబేడ్కర్

టీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మాజీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న విశ్రాంత వైద్యుడు ప్రసాద్

ఘట్‌కేసర్: దేశంలోని సబ్బండ వర్గాల కోసం అంబేడ్కర్ కృషి చేశారని తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మాజీ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ వైద్యులు పినపాటి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో రాందాసు, బాలయ్య, నర్సింగ్‌రావు, జగన్, రాజేశ్‌కుమార్, సత్యం, సుధాకర్, శ్రీరాములు, మహిపాల్, జగదీశ్, శ్రీరామ్, ఆనంద్, బీమా మోడ్కే, ఆనంద్ దుర్గే, శంకర్, విష్ణు, లలిత పాల్గొన్నారు.

పోషణ పక్వాడ షురూ..

- మేడ్చల్ జిల్లాలో ప్రారంభమైన పోషణ పక్వాడ కార్యక్రమం
- శివార్లలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు, 1.07లక్షల మంది లబ్ధిదారులు



సాక్షి,సిటీబ్యూరో: పోషకాహారం తీసుకుంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారు. బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత లేకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. ఇది పక్కాగా జరిగినప్పుడే లక్ష్యం నెరవేరుతుంది. దీనిలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ పోషణ పక్వాడ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 'సరైన పోషణ- ఆరోగ్య తెలంగాణ' నినాదంతో కార్యాచరణ చేపట్టారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పోషకాహారం అందేలా అవగాహన కల్పించనున్నారు.

– మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ప్రారంభమైన పోషణ పక్వాడ ప్రత్యేక కార్యక్రమం ఈనెల 22 వరకు అన్ని పట్టణాల్లో విజయవంతంగా కొనసాగేలా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ చర్యలు తీసుకుంటోంది.

సమస్యలు అధిగమించేందుకు..

జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. వీరికి నిత్యం కేంద్రాల నుంచి గుడ్డు, బాలామృతం, పోషకాహారంతో కూడిన భోజనం పంపిణీ చేస్తున్నారు. దీనికి రోజుకు ఒక్కో చిన్నారికి ప్రభుత్వం రూ.10 చొప్పున, గర్భిణులు, బాలింతలకు రూ.20 చొప్పున వెచ్చిస్తున్నారు. అయినా కొందరు అవగాహన లేక, ఆర్థిక స్తోమత లేక వయసుకు, పనికి తగ్గ ఆహారం తీసుకోవడం లేదు. ఫలితంగా గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఇది పుట్టబోయే బిడ్డతో సహా పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతోంది. సమస్యలు అధిగమించేందుకు పోషణ పక్వాడ కార్యక్రమం ఉపయోగపడుతుందని జిల్లా మహిళ, శిశుసంక్షేమం, అభివృద్ధిశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పోషణ కార్యక్రమం ఇలా..

చిన్నారులకు అన్నప్రాసన, ర్యాలీ, రక్తహీనత శిబిరాల ఏర్పాటు, సమావేశాలు, ప్రతిజ్ఞ, రైతు క్లబ్ సమావేశం, శుభ్రతపై అవగాహన, యువజన సంఘాల సమావేశం. ఆహార పంటలపై సదస్సు, కిశోర బాలికలకు అవగాహన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లతో పాటు, వైద్యారోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, పురపాలక సంఘాల అధికారులను భాగస్వామ్యులను చేస్తున్నారు. ఈ కార్యక్రమం వివరాలను ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కౌన్సెలింగ్ బుక్‌లో నమోదు చేసి సంబంధితశాఖ ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

793 కేంద్రాల్లో 1.07 లక్షల మంది

జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో ఆరు నెలల నుంచి ఆరేళ్ల పిల్లలు 90,361 మంది, గర్భిణీ మహిళలు, బాలింతలు 17,123 మంది ఉండగా.. మొత్తంగా 1,07,484 మంది ఉన్నారు. వీరిలో కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా.. 47,028 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

ప్రతి కేంద్రంలోనూ...

పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అవగాహన పెంచడంతో పాటు లోపాల నివారణపై అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళ, శిశు సంక్షేమం, అభివృద్ధిశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో షెడ్యూల్ ప్రకారం పోషణ పక్వాడ కార్యక్రమం విజయవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికార వర్గాలు చెబుతున్నాయి.